# వ్యధిత హృదయ

"నర్స్"!

లేచి వెళ్ళిపోదా మనుకున్న నర్సు వెనుదిరుగకుండానే మెడ నాకేసి త్రిప్పి? ఎందుకూ అన్నట్లు కనుబొమ లెగరేసింది.

"నా గుండెల్లో ఏమిటో మంటగా వుంది. డాక్టర్‌కి ఒక సారి చెబుతారా...."

"సారీ! రెండు నిముషాల్లో నైట్‌డ్యూటీ నర్సు వస్తుంది.. ఆమె నగడగండి.. నా నరాలు తోడుకు పోతున్నాయ్" నర్సు మరియమ్మ డ్యూటీ దిగిపోయింది.

రెండు నిమిషాలు నిండకుండానే కొత్తదీపం వెలిగించినట్లు కొత్త నర్సు రీటా నైట్ డ్యూటీలోకి ప్రవేశించింది. వస్తూనే అభివందనం చేసింది. నిత్యము రోగులందరి కోసం అలవాటు చేసుకున్న చిరునవ్వు విసిరింది.

రీటా ఆంగ్లో యిండియను. కాథలిక్కు అయ్యుండాలి. మెడలో క్రాసు వున్నది. పాతికేళ్ల పైబడి వుండవు. మిసమిసలాడే పసిడి ఛాయ. మంచి డాన్సర్ లాంటి అంగసౌష్టవం. మెరుపుతీగెలాంటి నడుమూ, ఆమె చురుకుదనం నన్ను చకితుణ్ణి చేసేది. గదిలో పనులు క్షణాలమీద ముగించేది, ఆమె పని చక్కబెడుతున్నా, పక్క దులుపుతూన్నా ఒక నృత్యవిన్యాసం వీక్షిస్తున్నట్లుండేది.

ఎంచేతనో నా గుండెలో మంటా శరీరంలోని అస్వస్థతా కొంత తగ్గేయి. అయితే రీటా చేత సేవ చేయించుకుందికి కూడా నాకు ఏదోలాగ వుండేది. బహుశా నాకు ఆంగ్లో యిండియన్లు అంటే వుండే నిరసనభావమే అందుకు కారణమో, యేమో నేనే చెప్పలేను.

రీటా కూడా నాతో మాట్లాడుతున్నప్పుడు కొంత నిరుత్సాహంగా వుండేది. చందమామ మీద మచ్చలాగ ఆమె మొహాన విషాద ఛాయ వొకటి అగుపించేది.

"దయచేసి డాక్టర్‌ని చూడగలనేమో కాస్త పిలుస్తారా?" యింగ్లీష్‌లో అడిగేను.

"ఛీ.. బెంగాళీలంటేనే వొళ్లు మండుతూంది" అంటూ విసుక్కొని వెళ్లిపోయింది.

నేను రెండు క్షణాలు ఆశ్చర్యంగా స్తబ్ధుణ్ణయ్యాను. బెంగాళీలా? అయితే నేను బెంగాళీ ననుకుందా?

ఔను. నాది కొంచెం మెత్తని శరీరం. మనిషినికూడా కాస్త్రా స్థూలకాయుడినే. బహుశా నా తెల్లని, నున్నని శరీరం చూసి అలాగనుకుందేమో?

సరే. యింగ్లీషు నాది బెంగాళీ వుచ్చారణే. ఎందుచేతనంటే కల కత్తాలో బెంగాళీ వాడి చేతిక్రింద అయిదేళ్ళు పనిచేశాను స్టెనో గ్రాఫరుగా.

నేనిలాగ ఆలోచిస్తూ వుండగా ఆమెవచ్చి మొహాన విసుగు జనించగా కనుబొమలు చిట్లించి, "ఆయన వస్తామన్నారు" అన్నది.

"థాంక్స్' అన్నాను నేను.

తర్వాత అడిగేను.. నా లోని అస్వస్థతతని మరో వ్యాపకంతో మరిచిపోవడం ఒక్కటే నేనప్పుడు చెయ్యగలిగింది.

"అయితే మా బెంగాళీ లంటే మీకు ప్రత్యేకించి కోపమా?"

రీటా కుర్చీలో కూచొన్నదల్లా లేచి కిటికీ దగ్గరికి వెళ్ళింది. "మీరు ముఖర్జీలా, ఛటర్జీలా?" అన్నది తనలో తాను గొణుక్కున్నట్లు.

"ఏ అర్జీలయితేనేం?.. ముఖర్జీలమే అనుకో" మన్నాను నేను.

ఆమె అవతల చీకట్లో ఏమో వెతుకున్నట్లు చూస్తూ నుంచున్నది.నాకు ఆ పిల్ల మొహం చూస్తే జాలివేసింది. పాతికేళ్ళు వుంటాయేమో.. నేను ఇదివరకు ఆంగ్లోయిండియను యువతులనువెరుగుదును. కిందామీదా చూడరు. రాలిపడిపోతారు అని తిట్టుకునేవాడిని కూడా... రీటా దారి వేరు. రీటా తెల్లని గౌను తొడుక్కుని వున్నా ఎంచేతనో ఏడుగజాల చీర కట్టుకున్నట్లు అగుపించింది. అదేమో నాకు విడుతూ వున్న మల్లెమొగ్గలా అనిపించింది రీటా.

"రీటా! మిస్ అననా, మిసెస్ అందునా?"

"మిస్ అనండి.. ఏం?" పడగెత్తినపాములా కనుబొమ లెగరేసింది.

"నువ్వు బెంగాళీలమీద అసూయపడడం బాగోలేదు".. నాలో నేనే అనుకున్నట్లు చెప్పేను.

"ఇది బాగుందేం?" ఆమె నా దగ్గరగా వచ్చి అడిగింది. ఆమె కళ్ళల్లో ప్రతీకార వాంఛ.. వంచితురాలి నయ్యానే అన్న జాలీ స్పష్టంగా అగుపించేయి.

"ఏది?" అన్నాను కాస్త వెనక్కి తగ్గి... భయపడుతూ.

"ఏమీలేదు... క్షమించాలి నర్సుగ్గా నాకు మిమ్మల్ని ద్వేషించే హక్కులేదు..." అని వూరుకుంది.

"లేదు రీటా... వుంది.. నీకు నన్ను ద్వేషించే హక్కు వుంది" నేను గొణుకున్నాను. "అయినా

కారణం చెప్పు.. విని బెంగాలీ వాడినైతే తప్పకుండా అందులోని దోషానికి నేనూ కొంత పరితపిస్తా" నన్నాను.

ఆమె కొంచెం చలించింది. నా కళ్ళల్లో వాత్సల్యమూ, సహనమూ గ్రహించినట్లు తెప్పరిల్లినది.

"నర్సులు అంటే యంత్రాలనీ రోగులు ఆటవస్తువులనీ కొందరు డాక్టర్లు అనుకొంటారు సుమా" అన్నది.

"నే పుట్టింది యీ గడ్డనే. నా పుట్టిల్లు యీ దేశం కాదు తెలుసా? అయితేనేం ఈ దేశం కోసం నన్ను నేనే ఆత్మబలి చేసుకున్నా... ఈ దేశం కోసరం అనడం న్యాయం కాదు అనుకోండి... కాని నా స్వార్థం కోసరమే అనుకోండి."

నేను లేచి, తలగడలు పేర్చి, వాటికి ఆని యీజీచెయిర్ వాటంలో పెట్టి పడుకున్నాను ఆమె కథ వినాలని కుతూహలంతో ఉద్యుక్తుడనయ్యాను.

×××

రీటా తల్లీ దండ్రీ యింగ్లాండు వెళ్ళిపోయేరు. అన్నదమ్ము లిద్దరూ కూడా నాకు రీటా కథ వినిపించిన నాటికి ఏడేళ్ళ క్రితం ఇంగ్లాండు వెళ్ళిపోయారు. రీటా నేను అనుకున్నట్లు ఆంగ్లోయిండియన్ కాదు. యూరోపియనట! తల్లీ దండ్రీతో గాని, అన్నదమ్ములతోగాని ఆమె దేశం వెళ్ళ నిరాకరించింది.

అందుకు కారణం - ఆమె చెప్పిన కథ.

రీటా దేశసేవ అనండి. మానవ సేవే అనండి. అదే చేద్దామని కుతూహలపడి ఒకనాడు ఆవేశపడి తిన్నగా మద్రాసు వచ్చి నర్సు ట్రెయినింగ్‌లో జాయినయ్యింది.నర్సు ట్రెయినింగ్‌లో వున్నంత కాలమూ ఆమెకు మొదట మూడు నెలలూ మామూలుగానే గడిచేయి.

అటు తర్వాత ఆమె రెండేళ్ళు ప్రేమప్రవాహంలో పడి కొట్టుకుపోయింది, వొడ్డునపడలేదు.

ఆమెకి రేడియోలజిస్టు, స్పెషలిస్ట్ శంభూఛటర్జీతో పరిచయం ఏర్పడ్డది. శంభూఛటర్జీ చాలా చలాకీ అయినవాడు. శనివారం రాత్రి ఖచ్చితంగా బాల్‌డ్యాన్సుకి హాజరయ్యేవాడు.

అక్కడే అతను రీటా దృష్టి నాకర్షించాడు. రీటాకి ఎందుకనో యీ దేశంమీదా, యీ దేశాచారాలమీద మక్కువ వుండేది. అందులోకి అగ్రకులాలంటేను. వారి సంస్కార సంస్కృతులన్నా ఆమెకి గౌరవం.

శంభూ ఆరడుగుల విగ్రహం. స్ఫురద్రూపి, మంచిమాటకారి. తన సబ్జక్టు ఎక్స్-రే వొక్కటే గాదు. ఈ ప్రపంచంలోని రక రకాల విషయాలమీద అతనికి అపారమైన జ్ఞానమూ, దానిని వెలువరించగల అ-నర్గళమైన వాగ్ధాటీ వున్నది.

బెంగాలీ వాళ్ళు స్వతస్సిద్ధంగా నిష్టాపరులూ, ప్రాంతీయాభిమానులూను. ఇది రీటా శంభూ విషయంలో ఆమోదించలేకపోయింది. అతగాడిది విశాలదృక్పథం అనుకున్నది.

రీటాకి తననుసరించగలవాడూ, తాను వరించేవాడూ అటు శారీరకంగానూ, యిటు మానసికంగానూ ఆరోగ్యవంతు డవ్వాలని అభిలాష వుండేది.

డాక్టర్ శంభు ఆమెని స్వర్గంలో విహరింపజేసేడు. "మత మనేది మనుషులను ఒకరినొకరు అర్థం చేసుకుందుకే వినియోగపడాలని వుంది గాని ఏ శాస్త్రం లోను ఒకరికొకరు శత్రువు లవ్వాలని లేదు" అనేవాడు.

"ఆకాశం, మీద నక్షత్రాలకి ప్రకాశించే హక్కు యెలాంటిదో మనకి అనుభవించే హక్కు అలాంటిదే" ననేవాడు. రీటా తనకు తెలియకండానే శంభూకి దాసురాలయ్యింది.

అయితే ఆమె ఆలోచించక పోలేదు. ఆమె తల్లిదండ్రీ యిందుకు ఎంతమాత్రమూ సమ్మతించలేదు. తమ దేశానికి వెళ్ళి పొచ్చేయమ్మన్నారు.

అదీగాక అతడు బెంగాలీ, వాళ్ళకి పట్టుదలలు - ఎక్కువ. అందులోకి అతగాడు అగ్రకులజుడు. అసలే వాళ్ళ సమాజం కట్టుదిట్టమయినది.

"అతడు కులభ్రష్టుడూ మత భ్రష్టుడూ, ఐనా నిన్ను మేము మతభ్రష్టురాలి నవనివ్వ"మని వాళ్లు నిష్కర్షగా చెప్పేరు.

అయితే అవేమీ రీటా ప్రేమకి కట్టలు కాలేకపోయాయి. ఆమెకి శంభూ ఛటర్జీమీద అంతులేని విశ్వాస మున్నది. నేనీ దేశం లోనే పుట్టాను. నన్నీభూమ్మీద వొదిలి పొమ్మని తన కుటుంబాన్ని తిరస్కరించింది రీటా.

శంభూ ఛటర్జీతో ఆమె ప్రతి విషయమూ చెబుతూనే వున్నది. ఎప్పటికప్పుడు తన మనసులోని కోర్కెను బయటపెడుతూనే వున్నది.

ఆ డాక్టర్ శంభూ ఎప్పుడూ ఆమెకు మాట్లాడేందుకు అవకాశం యిచ్చేవాడుగాదు. "ఇష్! ఏమిటాబెంగ... యింతటి మధురమైన క్షణాలు తిరిగిరావు... వీటిని అనవసరమైన విషయాలతో కలుషితం చెయ్యకు" మని తన పెదవులతో ఆమె నోరు నొక్కేవాడు.

చివరికి నర్సు ట్రెయినింగు పూర్తయ్యేసరికి రీటా యీ దేశంలో ఏకాకి అయి నిలిచింది.

శంభూ ఛటర్జీకి ప్రమోషన్ మీద ప్రమోషన్‌లు వస్తూనే వున్నాయి.

రీటాతో మైత్రిని మాత్రం అతడు తగ్గించసాగేడు. రీటా వసంతకాలంలో చెట్టుకి ప్రాకి పెనవేసుకొనే లతలాగ అతగాడికి మరింత మరింత సన్నిహిత మవడానికి ప్రయత్నం చేసేది.

"డియర్! ఎన్నాళ్ళీ దాగుడు మూతలు... నువ్వు తండ్రివి కాబోతున్నావ్! ఇప్పుడేనా రిజిస్ట్రార్ ఆఫీసుకు పద" అన్నది ఒకనాడురీటా.

శంభూ ఛటర్జీ మొహంలో కత్తివేస్తే నెత్తురులేదు. గొంతుక పెగలక కొన్ని క్షణాలు వూరుకుని మళ్ళీ కలుస్తానన్నాడు.

మర్నాడు ఆమెకు తెలిసిందల్లా శంభూచటర్జీ సెలవుపెట్టి దేశం వెళ్లాడని, ఆమెకు నెత్తిన పిడుగు పడింది.

నిలువునా తనను తాను చిత్రవధ చేసుకుందామనిపించింది. ఛీ ఛీ! ఎంత వంచకుడు! అని అసహ్యించుకున్నది.

రెండు నెలలు తిరగలేదు శంభూ ఛటర్జీ పెళ్లి ఫోటోలు పేపర్లన్నీ అచ్చుగుద్దేయి. అతగాడు లాంఛన సమేతంగా ఒక బారిస్టర్ గారయిన ఒక ఛటర్జీగారి కూతుర్ని వివాహమాడాడు.

అటు తర్వాత రీటాకి శంభూ చటర్జీ గురించి, తెలియ రావడం కేవలం పేపర్లలోపడ్డ అతని ప్రమోషన్‌ల ద్వారానే.

శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన చటర్జీ - రీటాతోమాట్లాడాడంటేనే ఎవ్వరూ నమ్మరు.

కథ విన్న తర్వాత నా కనుకొలకుల్లో నిండినకన్నీటి బిందువులను రీటాకి అగుపించనివ్వలేదు.

"నేను తెలుగువాణ్నిచెల్లీ!" అని ఆక్రోశించింది నా హృదయం - కాని.

"నేను కూడా చటర్జినే..." అన్నాను యాంత్రికంగా పెదవులు కదిపి...

"ఐ హేట్ యూ...." అని వెళ్ళిపోతున్న రీటా మగజాతినే శపించిందా? అన్నట్లనిపించింది.

"నాకు తెలుసు! చటర్జీలనే ద్వేషించే రీటా హృదయంలో వ్యధకి ఉపశమనం కలిగించాలంటే నేనూ చటర్జీనవ్వాలి-"

రీటా మరొకర్నికట్టుకొని సుఖపడాలంటే ఆమెకి "వ్యధ" కాదు అవసరం "పగ"!

**(1960 స్నేహలత)**